# సినీ వైరాగ్యం

'జయంతి'




రాత్రి భోజనం ముగించి వక్కపొడి నోట్లో వేసుకుని పడగ్గదిలోకి వచ్చాడు రఘు. కింద కూర్చుని చందమామ పుస్తకంలోని కేమెల్ ఎడ్వర్ టైజ్మెంటు బొమ్మకి నేను రంగులు వేస్తా అంటే, నేను వేస్తా అంటూ పోట్లాడుకుంటున్న ఏడేళ్ళ బాబ్జీ, అయిదేళ్ళ బేబీ పోట్లాట ఆపేసి తండ్రిని తీర్పు చెప్పమని అడిగారు. అంతా విన్నాడు రఘు. విని—"వెధవ పోట్లాటా, మీరూను. అస్త

మానం పోట్లాడుకుంటారేం? అయినా ఇప్పుడేం రంగులు వెయ్యడం? పుస్తకాలు తీసి చదువుకోండి" అని కసిరాడు. "నిద్ర వస్తాంది, డాడీ" అంటూ ఒక్క పరుగున వెళ్ళి మంచాలు ఎక్కారు ఇద్దరూ. చిన్నగా నవ్వుకున్నాడు రఘు. చదువుకోమంటే చాలు వెంటనే నిద్ర వచ్చేస్తుంది వెధవలకి అనుకుంటూ పడక్కుర్చీలో కూర్చున్నాడు. కూని రాగాలు తీస్తూ వచ్చింది జానకి. "అమ్మయ్య ఈ పూటకి నా ఆఫీసు మూసేశాను" అంటూ భర్త పక్కనే నేలమీద కూర్చుని వారపత్రిక అందుకుంది.

ఒక్క నిమిషం పూరుకుని "బోర్‌గా ఉంది. సినిమాకి వెళ్దా మేమిటి?" అన్నాడు రఘు.

"ఇప్పుడా?" అంది జానకి.

"ఫరవాలేదు. ఎనిమిదిం బావేగా అయింది. త్వరగా బయలు దేరితే వెళ్ళచ్చు."

"ఏ సినిమాకి వెళతాం."

"ఆ పేపర్ ఇలా పడేసి నువ్వు తయారవటం మొదలు పెట్టు."

వెంటనే లేచి భర్తకి పేపరు అందించి లోపలికి వెళ్ళింది జానకి.

అప్పటిదాకా దుప్పట్లో ముసుగు పెట్టుకుని నిద్ర కోసం ప్రయత్నిస్తున్న పిల్లలు పిడుగుల్లా లేచి ఒక్క పరుగున తండ్రి పక్కన చేరారు.

"డాడీ! మేంకూడా సినిమాకి వస్తాం" అన్నాడు బాబ్జీ. తండ్రి సమాధానం చెప్పే లోపలే ఒళ్ళోకి ఎక్కి కూర్చుని, "డాడీ! నేనుకూడా సినిమాకి వస్తా బోర్‌గా ఉంది" అంది బేబీ, ముద్దుగా. ఫక్కున నవ్వుతూ కూతుర్ని ముద్దు పెట్టుకున్నాడు రఘు, "బోర్ అంటే ఏమిట్రా, తల్లీ?" అన్నాడు. "బోర్ అంటే బోర్" అంటూ సమాధానం చెప్పింది బేబీ.

"వాళ్ళ సుమిత్రకు చెప్పాను. పిల్లలకు సాయం పడుకుంటానంది" అంటూ గదిలోకి అడుగు పెట్టిన జానకి ఆశ్చర్యంగా ఆగిపోయింది. "మమ్మీ! మేముకూడా వస్తున్నాం సినిమాకి" అంటూ ప్రకటించేశారు ముక్త కంఠంతో. "త్వరగా తయారవ్వు" అంటూ ఆర్డర్ ఇచ్చేశాడు రఘు. "పదండిరా" అంటూ హడావుడి పడిపోయింది జానకి. మరో పావుగంట తరవాత తయారై ఇంటికి తాళం పెట్టి బయట పడ్డారు ఆ చింతలు లేని కుటుంబ సభ్యులు. రోడ్డు మీదికి వెళ్ళారు. "డాడీ! ఆటో పిలవండి—బస్‌లో ఎక్కాలంటే నాకు బోర్"అన్నాడు బాబ్జీ. "అలాగే, నాన్నా! పుండరీకాక్షయ్యగారి మనవడిని, రామచంద్రం మేనల్లుడిని నిన్ను చూస్తూ చూస్తూ బస్సు ఎక్కించేస్తానా" అన్నాడు రఘు. "మా సరేలెండి సరసం. ఇప్పుడు మా నాన్న, అన్నయ్య సంగతి ఎందుకు?" అంటూ రుస రుసలాడింది జానకి. చిలిపిగా నవ్వాడు రఘు. తల్లిదండ్రుల సంభాషణ పిల్లలకి నచ్చలేదు. "నాన్నా! ఏం సినిమాకి వెళుతున్నాం?" అన్నాడు బాబ్జీ మాట మారుస్తూ. "తెలుగాడు సినిమాకి వెళదాం, డాడీ! పుట్టింటాలెళ్ళ తరిమేశాడూ కుట్టుక్కున్నాడూ వదిలేశాడు పాట ఎంతో బాగుందట మా ఫ్రెండ్ చెప్పింది" అంటూ తన కోరిక తెలిపింది బేబీ. ఉలిక్కి పడి కూతుర్ని చూశాడు రఘు. "చ. పాడు పేస్కు. సూపర్‌మేన్‌కి పోదాం" అన్నాడు బాబ్జీ—చెల్లిని మందలించి తన అభిలాష తెలియ జేస్తూ. భయ్స్తురాలా నీ కోరిక ఏమిటి? అన్నట్లు చూశాడు రఘు. "బాపు, విశ్వనాథ్— వీళ్ళిద్దరిలో ఎవరి సినిమా అయినా ఫరవాలేదు" అంది జానకి. "మిమ్మల్నందర్నీ మంచి పిక్చర్‌కి తీసుకు వెళతాను" అంటూ అందర్నీ సస్పెన్స్‌లో పెట్టి దారిన వెళుతున్న ఖాళీ ఆటో ఆపాడు.


హుషారుగా ఎక్కారు పిల్లలు. ఆటో బయలు దేరాక—"ఏమిటో అంత మంచి సినిమా!" అంది జానకి కుతూహలంగా. "మాయాబజార్" అంటూ సమాధానం చెప్పాడు రఘు. జానకి మొహం చింకి చేటంత అయింది. నీ వే నా పను తలచినది అంటూ కూనిరాగం మొదలు పెట్టింది. "స్టాప్. స్టాప్. నా కా పాటంటే చాలా ఇష్టం. దాన్ని అలా ఖూనీ చేసెయ్యకు" అన్నాడు రఘు కొంటెగా. విసురుగా మొహం తిప్పుకుని, "వో దుబ్బో. మహా గొప్ప గాయకులు బయలుదేరారు లెద్దురూ" అంటూ విసుక్కుంది జానకి. "గొప్ప గాయకుడిని కాకపోయినా నీ కంటేనయమే. నీకు గుర్తు లేదూ. మన పెళ్ళినాడు నాడు మేజావాణిలో 'ఏడెము సేయవే' అని కీర్తన మొదలెట్టావు. వెంటనే సగం మంది చుట్టాలు పెట్టెలు సర్దుకుని ప్రయాణం అయ్యారు కదూ!" భర్త చిలిపితనానికి నవ్వూ, కోపం ముంచుకు రాగా తగిన సమాధానం చెప్పడానికి ఆలోచిస్తూ ఉండగానే ఆటో హాలు ముందు ఆగింది.

హడావిడిగా దిగారు అందరూ. డబ్బు లిచ్చేసి లోపలికి పరిగెట్టినట్లు వెళ్ళాడు రఘు. "ఇదేం సినిమా, అమ్మా?" అన్నాడు బాబ్జీ విసుగ్గా. "చాలా బాగుంటుంది, నాన్నా! భలే నవ్వు వస్తుంది" అంది జానకి. పిల్లల ముఖాలు వికసించాయి. అంతలోనే రఘు తిరిగి వచ్చాడు. ముఖం వేలాడేసుకుని "హవుస్ ఫుల్" అన్నాడు నీరసంగా.

జానకి దిగాలు పడిపోయింది. "మరి ఏం చేద్దాం, నాన్నా? ఇంటికి వెళదామా?" అన్నారు పిల్లలు ఏడుపు గొంతుతో. భార్యా బిడ్డలని చూసి జాలి వేసింది రఘుకి. "ఎందుకూ మరో సినిమాకి పోదాం" అంటూ మళ్ళీ ఆటోని పిలిచాడు. క్రాస్ రోడ్స్‌లో దిగారు. సినిమా హాల్లోకి నడిచాడు రఘు. "అమ్మా పర్లీలు"అంటూ అల్లరి మొదలు పెట్టారు పిల్లలు. "అబ్బ ఇల్లు కదిలితే మేత మొదలు" అని కసిరింది జానకి. పిల్లలు సణుగుడు మొదలు పెట్టారు. అంతలోకీ రఘు బయటకి వచ్చాడు. చేతిలో మల్లె పూలదండ చూసి ఆశ్చర్యపోయింది జానకి. "ఏమిటిది? టిక్కెట్లతో మల్లె పూలు ఉచితంగా ఇస్తున్నారా?" అంది ఆశ్చర్యంగా. చిన్నగా నవ్వాడు రఘు. "కాదులే" అంటూ పువ్వులు అందించాడు. అందుకుని, "టిక్కెట్లు దొరకలేదా?" అంటూ ప్రశ్నించింది. "టిక్కెట్లకేం, బోలెడు ఉన్నాయి. కాని బుకింగ్ దగ్గర కూర్చున్నతను ఎవరో తెలుసా? మా ప్రసాద్ తమ్ముడు." అలా లోకా లేని ఆ సంభాషణకి విసుగ్గా మొహం పెట్టింది జానకి. అది గమనించినట్లే— "ఆ ప్రసాద్ గాడికి నే నంటే చాలా ఇష్టం. అతని తమ్ముడికి నే నంటే గౌరవం. నన్ను చూడగానే వినయంగా నమస్కారం పెట్టాడు" అంటూ చెప్పుకు పోతాగాడు రఘు.

"వెధవ సొద" అని డైరెక్టుగా విసుక్కుంది జానకి. "ఉండవోయ్ పూర్తిగా చెప్పనీ. 'నమస్కారం పెట్టాడా? నేనూ నమస్కారం పెట్టి టిక్కెట్లు ఇమ్మన్నాను. వెంటనే అటూ ఇటూ చూసి, ఈ సినిమా చండాలంగా ఉందండీ. ఎందుకు డబ్బులు దండగ?మరో సినిమా కెళ్ళండి" అన్నాడు. వెనక్కి తిరిగి వచ్చేస్తూ ఉంటే పూలవాడు కనిపించాడు" అంటూ అసలు రహస్యం బయట పెట్టేశాడు రఘు. అప్పటి దాకా తండ్రి చెప్పింది శ్రద్ధగా వింటున్న బాబ్జీ "అయితే ఏమిటి? మనం సినిమాకి వెళదామా?" అన్నాడు కం టు ది పాయింట్ అని నిండీస్తూ. "వెళదాం నాన్నా వెళదాం" అంటూ పాపని ఎత్తుకున్నాడు రఘు. బాబ్జీ చెయ్యి పట్టుకుంది జానకి. రోడ్ క్రాస్ చేసి విసుగు చెందని విక్రమార్కుడిలా మరో హాలు వైపు నడిచారు.

బయట లైట్లు, దాదాపు వంకై అడుగుల



ఎన్నో హిట్ కటవుట్ అంతా ఆట్టహాసంగా ఉంది వాతావరణం. 'విజయవంతంగా నడుస్తున్న రెండవ వారం, అని బోర్డు అయితే ఉంది కానీ, ఆ సూచనలు ఏవో వనిపించటం లేదు. మరో పక్క నేడే చూడండి అనికూడా వేశారు. అంటే రేపటికి ఉంటుందన్న నమ్మకం లేదన్నమాట. "మరేమిటి నేడే చూసే ద్దామా?" అంటూ భార్యని సలహా అడిగాడు రఘు. "మీ ఇష్టం" అంది జానకి. "సరే సర చూసేద్దాం" అంటూ లోలికి నడిచి టికెట్లు కొనేశాడు. ఇరవై రూపాయలు ఇచ్చి టికెట్లు, అయిదు రూపాయల నోటు తిరిగి అందుకుని జానకి దగ్గరకు వచ్చాడు. తండ్రి చేతుల్లో టికెట్లు చూసి కేరింతలు కొట్టారు పిల్లలు. గేటు దగ్గర టికెట్లు ఇచ్చి, ముక్కలు అందుకుని లోపలికి నడిచాడు రఘు. టార్చిలైటు వెలుగులో ఆ టార్చి లైటు మనిషి దగ్గిరికి వెళ్ళి వెంబరింగ్ లేదా అని అడిగాడు. "మామూలుగా ఉంటుంది, సార్" అని వూరుకున్నాడు అతను. అప్పుడు చూట్టూ చూశాడు.

చుక్కల ముగ్గులో గొబ్బిళ్ళ లాగా అక్కడక్కడా ఉన్నారు జనం. గుండె తారుమంది రఘుకి. హారి భగవంతుడా! రెండవ వారమే ఇంతమంది వచ్చారంటే అనుకుంటూ దిగులుగా ఆఖరి వరసలోకి వెళ్ళి కూర్చున్నాడు. అతని పక్క జానకి, ఆ పక్కన బాబీ, పక్కన బేబీ కూర్చున్నారు. "ఆ! నేను అమ్మ పక్క కూర్చుంటా" అంటూ పేచీ పెట్టి సీటు మారింది బేబీ. "హాలు ఇంత ఖాళీగా ఉన్నా, పిల్లలకి ఫుల్ టికెట్లు తీసుకుంటారు దేనికో. రష్‌గా ఉన్నప్పుడైతే కొనమన్నా అర్థం ఉంది" అంది జానకి. "సరే బాగుంది—రూల్ రూలే" అంటూ హాలువాళ్ళనే సమర్థించాడు రఘు. "ఏం రూల్స్. మన రోజుల్లో లేవు ఈ రూల్సు. చేతుల్లో పిల్లలకి టికెట్లు అడిగే వారు కాదు" గతం గుర్తు చేసుకుంది జానకి.

పక్కున నవ్వాడు రఘు. "నీ చిన్నతనం సరేలే. హాలు బయటి దాకా అందరూ నడిచి వచ్చేవాళ్ళు మీరు. హాలు వాకిట్లో అందరు పిల్లల్నీ తలొకరి చంకా ఎక్కించేసి మూడు టికెట్లు కొనేశాడు మీ నాన్న. ఆ మూడు టికెట్లతో ఏడుగురు సినిమా చూసేసే వాళ్ళు కదూ? నీ పెళ్ళయ్యేదాకా నీకు టికెట్టు కొనకుండానే మేనేజ్ చేసినట్టున్నాడు మీ నాన్న." "వూ సరేలెండి మీ ఎగతాళి. ఆ రోజుల్లో అందరూ అంతే." అంటూ తండ్రిని సమర్థించింది జానకి. తెర పైకి లేవడంతో పోట్లాట తాత్కాలికంగా ఆపేసి తెర వైపు చూస్తూ కూర్చున్నారు. "ప్రకృతి మనకు ప్రసాదించిన వరం పళ్ళు" అంటూ మొదలైంది ఎడ్వర్ టైజ్‌మెంటు. "అబ్బ ఇప్పటికి లక్షా తొంభై సార్లు చూసిందేగా" అనుకుంటూ దృష్టి మళ్ళించి చుట్టూ చూశాడు రఘు. ముందూ, రెండు పక్కలా అంతా ఖాళీ. ఆ మసక వెలుతురులో భార్య ముఖం ఎంతో అందంగా కనిపించి చెయ్యి చాచి భార్య భుజం మీదుగా వేసి ఫ్రీగా కూర్చున్నాడు. భర్త కుర్చీ వైపు ఒరిగికూర్చుంది జానకి. రెండవచెయ్యి జాపి భార్యచెయ్యి అందుకుని తెరవైపు దృష్టి మళ్ళించాడు నాలుగైదు ఎడ్వర్‌టైజ్‌మెంట్లు అయిపోయాయి. "జానీ ఆవిడచూడు ఎంత స్టైలుగా తయారై బట్టలు ఉతుకుతుందో. నువ్వూ బట్టలు ఉతుకుతావ్. ఏడ్రాసిలా ఉంటావు. కాస్త చూసినేర్చుకోరాదూ." "ఆ ఎందుకు తయారవనూ? ఎవరైనా ఫోటో తీస్తానంటే నేనూ అలాగే తయారవుతా!" టకీమని సమాధానం చెప్పింది జానకి. న్యూస్ రీలు మొదలైంది వరదలు, కరువులు, పేదరికం అన్నీ చూపించి దక్షిణ భారత సమాచారంకూడా చూపించారు. "అబ్బ ఇంకెప్పుడు సినిమా వస్తుందమ్మా" అంది బేబీ విసుగ్గా. "ఇదుగో వచ్చేస్తుంది" అంది జానకి. సెన్సార్ సర్టిఫికేట్ 'యు" ఇరవై రీళ్ళు. ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు రఘు.

సినిమా మొదలైంది. జరుగ వలసినవి అన్నీ రొటీన్‌గా జరుగుతున్నాయి. కాసేపు చూసేసరికి విసుగు వేసింది రఘుకి. ప్రతి సినిమాలోనూ కొత్తదనం ఆశించటం అత్యాసే. కానీ మరీ ముక్కికి ముక్కలు ఎంతకని చూడటం? చూడక ఏం చెయ్యటం? తనకి తనే నచ్చ చెప్పుకుని సీరియస్‌గా సినిమా చూడటం మొదలు పెట్టాడు. తెర మీద బావా మరదళ్ళు పాట పాడుతున్నారు. తన చేతుల్లో ఉన్న భార్య చేతిని గట్టిగా నలిపాడు "చూడు జానీ




నూతన యవ్వనం పొందండి!

జీవితములో పోగొట్టుకున్న యవ్వనమును, నరముల బలమును తిరిగి పొందుటకు ఇతర చికిత్సలవలన ప్రయోజనము పొందక విసుగు చెందినవారు సంపూర్ణ సుఖము పొందు చున్నారు!

భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన

కవిరాజ్

డా॥ డి. హనుమంతరావు

ముహాంకాళీవీధి, సికిందరాబాదు. (GOVT REGD)

సలహా ఫీజు 10॥ రూ. * మందుల ఛార్జీలు ప్రత్యేకం.

సంప్రదించు వేళలు:

ఉదయం 8 నుండి 12 వరకు పగలు 3 నుండి 7 వరకు.

ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

ప్రతి నెల 4, 5 తేదీల్లో విశాఖపట్టణం

హోటల్ [illegible] డాబాగార్డెన్స్‌లో క్యాంపు కలదు.



VIJNANA VIHARA

ENGLISH MEDIUM RESIDENTIAL SCHOOL

GUDILOVA-531 173

VISAKHAPATNAM (Dist)

Application, prospectus alongwith model papers — for an entrance examination into class V, to be held on 6-5-1984 — can be had on payment of Rs. 12/- either by M.O. or cash to the Principal.

PRINCIPAL

బావా బావా అంటూ నెలా మీద పడి పోతూందో! నువ్వూ ఉన్నావు ఎందుకూ? పెళ్ళికి మూడేళ్ళ ముందే నిశ్చయతాంబూలాలు పుచ్చుకుని ప్రధానం చేశారు మనకి. ఒక్కనాడైనా దొంగ చాటుగా ఒక్క ముద్దు ఇచ్చావా? పోనీ బావా అంటూ నోరారా పిలిచావా? నేను ఇటు వస్తుంటే అటు పారిపోయే దాని." అన్నాడు గారంగా.

గయ్‌మని లేచింది జానకి. "చాల్లేండి సంబరం నా మొహానికి ముద్దు ఒకటి తక్కువ. ప్రధానం అయింది కదా అని నాన్న పండగకి పిలిచారు తమరిని. ఆ సంవత్సరమేగా తమరు ఎగిరి పరీక్ష తప్పింది దానితో మీ నాన్న మీ చదువు అంతా నా వల్లనే నాశనం అయిపోతూందని నన్నూ, మా నాన్నని ఎన్ని తిట్లు తిట్టారో మీ కేం తెలుసు?" అంది ఏడుపు గొంతుతో. నిలువునా నీరుగారి పోయాడు రఘు. మరదలిని పెళ్ళి చేసుకుంటే వచ్చే పెద్ద చిక్కు ఇదే. మామూలు పెళ్ళి కేసుల్లో లాగా నేను యూనివర్శిటీ ఫస్టు వచ్చాను. చిన్నప్పుడు నా తెలివి తేటలు చూసి మా వూళ్ళో అందరూ మురిసి ముక్కచెక్కలై పోయారు అని పెళ్ళాం ముందు కోతలు కోసే అవకాశం ఉండదు.

మేనమామ కూతుర్ని చేసుకుంటే ఇదో పెద్ద డిజెడ్వాంటేజి. ఎప్పుడు పరీక్ష తప్పిందీ, ఎప్పుడు ఎవరెవరి చేత ఎలా చివాట్లు తిన్నదీ, ఎన్నిసార్లు దెబ్బలు తిన్నదీ, అన్న ప్రాసననాడు ఏం ముట్టుకున్నదీ, ఉయ్యాల తొట్లో వేసిన నాడు ఎలా ఏడిచిందీ —అన్నీ వివరాలు పెళ్ళాల నోటేసులకి వెళ్ళిపోతాయి పెళ్ళికి ముందే. అవన్నీ జాగ్రత్తగా గుర్తు ఉంచుకుని సమయం సందర్భం కలిసి వచి నప్పుడల్లా చురకలు పెడుతూ ఉంటారు ఈ మరదళ్ళు.

దీర్ఘంగా నిట్టూర్చి జానకి భుజం మీద వేసిన చేయి తీసి చేతులు కట్టుకుని సీరియస్‌గా సినిమా చూడసాగాడు రఘు. భర్త వంక చూసి చిన్నగా నవ్వుకుంది జానకి. ఓరకంట అది గమనించి మరీ బిగుసుకు పోయాడు రఘు. "ఉన్న మాట అంటే ఉలుకెందుకో" అంది జానకి చిలిపిగా. నిజమే మరి. ప్రధానం అవగానే పండక్కి మేనమామగారింటికి అల్లుడి హోదాలో వెళ్ళి. దర్జాగా మర్యాదలు జరిపించుకుని వచ్చాడు. అయితే ఆ సంతోషం నిలవకుండా వారం తిరిగేసరికల్లా రిజల్ట్సు వచ్చేశాయి. గ్రూప్‌లో పోయింది. 'కెమిస్ట్రీ పేపరు చాలా కఠినంగా ఉంది నాన్నా. చాలామంది పరీక్ష పోయింది' అంటూ ఎంత మొత్తుకున్నా వినిపించుకోలేదు తండ్రి. 'వెధవా! ప్రధానం అయ్యేసరికే పరీక్షలు తప్పటం మొదలు పెడితే పెళ్ళి అయితే ఎందుకు పనికొస్తావురా నువ్వు' అంటూ తిట్టి పోశాడు.

అంతటితో ఆగలేదు. ఏదో బంధువుల ఇంట్లో పెళ్ళిలో కలిసిన బావమరిదిని, అతడి కూతుర్ని కూడా బాగానే మందలించాడు. గతం నెమరు వేసు కుంటున్న రఘు ఉలికిపడి పక్కకి చూశాడు. అతని చేతిని తన చేత్తో పెనవేసి మరోసారి, "బావా" అంది జానకి మధురంగా. పులకించి పోతున్న మనస్సుని అదుపులో పెట్టుకుని—"సరేలే సరసం. సినిమా చూడు" అంటూ సినిమా చూడసాగాడు. ఏదో రేప్‌సీన్. భీకరంగా ఉంది. హాలు ప్రతిధ్వనించి పోతోంది ఆర్తనాదాలతో.

"అమ్మా! అబ్బాయి అమ్మాయిని ఏం చేస్తున్నాడు?" అంది బేబీ భయం భయంగా. ఇబ్బందిగా చూసి—"అమ్మాయికి కడుపులో నొప్పిగా ఉంది. అందుకే ఏడుస్తూంది" అంది జానకి కూతురి తల మీద చెయ్యి వేసి. "చ కాదమ్మా! అప్పుడే కడుపు నొప్పి ఏమిటి? అది రేప్‌సీన్" అన్నాడు బాబ్జీ, తల్లి అమాయకత్వానికి అబ్బుర పడుతూ. గతుక్కుమంది జానకి.


"రేప్ అంటే ఏమిట్రా, అన్నయ్యా?" అంది బేబీ—తల్లి కంటే అన్నయ్యకే ఎక్కువ తెలుసు అని గ్రహించుకుని. "రేప్ అంటే తెలీదుటే. మొద్దూ." అని విసుక్కుని "ఇంకాసేపుంటే ఆ అమ్మాయికి పిల్లాడు పుడతాడు" అంటూ తెలియ జెప్పాడు బాబ్జీ. దిగాలు పడి పోయింది జానకి.


చిన్నగా నవ్వాడు రఘు. "పులి కడుపున మేక పుడుతుందా? నేనూ ఇంతే. పదిహేనో ఏటనే సృష్టి రహస్యాన్ని గ్రహించేశాను" అన్నాడు గుసగుసగా. "ఉద్ధరించారు" అంటూ విసుక్కుంది జానకి. మళ్ళీ నవ్వాడు రఘు. "మీకు నవ్వేలా వస్తూందండీ. ఛీ దిక్కుమాలిన సినిమాలు. ఇకనించీ పిల్లన్ని తీసుకుని చస్తే సినిమాకి రాను." భార్య ఆవేశం చూసి చిద్విలాసంగా నవ్వాడు రఘు. "పిచ్చిదానా! నువ్వు సినిమా చూడడం మానేసినంత మాత్రాన ప్రయోజనం ఉంటుందా? తెల్లవారి లేస్తే పేపర్ల నిండా అనే కబుర్లు. ఎవరి నోట విన్నా అవే సమాచారాలు. ఇవ్వాళా, రేపూ మనకన్నా పిల్లలకే ముందుగా తెలిసి పోతున్నాయి ఈ మానభంగాలూ, హత్యలూ. నలుగురితో పాటే మనమూ. వూరికే ఆవేశపడి పోకు" అన్నాడు ఆదరంగా. మరోసారి నిట్టూర్చి తల వంచుకుంది జానకి.

హఠాత్తుగా లైట్లు వెలిగాయి. ఇంటర్వెల్. కళ్ళు చిట్లించుకుని లేచి నిలబడ్డాడు రఘు. "పద టీ తాగుదాం" అంటూ పిలిచాడు. "వద్దు మీరు వెళ్ళండి" అనేసింది జానకి. "నాన్నా! నాకు మంచినీళ్ళు కావాలి" అంది బేబీ. "రా తల్లీ" అంటూ కూతుర్ని ఎత్తుకుని బయటికి నడిచాడు రఘు. "చిప్స్, బిస్కెట్స్" అంటూ వచ్చాడు ఒక కుర్రాడు. "అమ్మా చిప్స్" అంటూ సణుగుడు మొదలు పెట్టాడు బాబీ. "వద్దు, నాన్నా, ఇవి మంచివి కావు" అంది జానకి. "వూవూ" అంటూ ససగసాగాడు బాబ్జీ.

పిల్లవాడి ఏడుపు, తల్లి మందలింపు గమనించి వీళ్ళ ఎదురుగా నుంచుని "చిప్స చిప్స్" అంటూ అరవసాగాడు ఆ కుర్రాడు. వ్యాపార లక్షణం. లోలోపలే విసుక్కుని విధి లేక రెండు పాకెట్లు కొంది జానకి. "అయ్యగారు అవతలికి వెళ్ళారు. తరవాత రా" అని చెప్పింది. "సరే" అంటూ వెళ్ళిపోయాడు ఆ చిప్స్ అమ్మే కుర్రాడు.

రెండు నిమిషాల అనంతరం రఘు లోపలికి వచ్చాడు. అతని చేతుల్లో ఉన్న బేబీ చేతుల్లో క్రీం బిస్కెట్సు పాకెట్లు ఉన్నాయి. అన్న చేతుల్లో చిప్స్ పాకెట్ చూసి చెల్లెలు, చెల్లి చేతుల్లో క్రీం బిస్కెట్ పాకెట్‌చూసి అన్నగారు మహా ఆనంద పడిపోయారు. కుర్చీలో కూర్చుని నిశ్చింతగా తినడం ప్రారంభించారు. రఘుని చూడగానే చిప్స్ కుర్రాడు వచ్చేశాడు. అయిదు రూపాయల కాగితం అందించి చిల్లర తీసుకున్నాడురఘు.ఉసూరుమనిపించింది జానకి ప్రాణం."అబ్బ వీళ్ళు పిల్లలుకారు, బాబూ రాక్షసులు. హాల్లో అడుగు పెట్టడం ఆలస్యం. మేత కావాలి. కనిపించిన ప్రతిదీ కావాలి" అంది చిరాకుగా. చిరునవ్వు నవ్వాడు రఘు. చెయ్యి జాపి కూతురి తల నిమిరాడు. "పసి జానీ. పసివాళ్ళు.ఏ చీకూ చింతా. లేకుండా తినే వయసు ఇదే. పెద్దయ్యాక లక్ష సమస్యలు. నువ్వూ, నేనూ చిప్స్ కొనుక్కుని ఇంత ఆనందంగా తినగలమా? ఆ డబ్బు ఉంటే బస్సుకి ఉంటుంది అనుకుంటాను నేను. ఆ డబ్బుతో రేపు కూర గడిచి పోతుంది అనుకుంటావు నువ్వు." అతని మాటలలోని నగ్న సత్యాన్ని గ్రహించిన జానకి దీర్ఘంగా నిట్టూర్చి బేబి బుగ్గలు నిమిరింది.






లైట్లు ఆరిపోయాయి. సినిమా మొదలయింది. హీరో కష్టపడి పైకి వచ్చేశాడు. బి. ఏ. పాసయ్యాడు. కంపెనీలో ఉద్యోగం వచ్చింది. రెండంతస్తుల మేడలో కాపరం పెట్టాడు. హీరోయిన్ రోజుకి ఒక పట్టు చీర చొప్పున కట్టుకుని తిరుగుతూంది. కుతూహలంగా చూస్తోంది జానకి. "అమ్మా. దాహం వేస్తోంది" అన్నాడు బాబీ. "పద" అంటూ లేచి బయటికి తీసుకు వెళ్ళింది.

అయిదు నిముషాల తర్వాత తిరిగి వచ్చారు తల్లీ కొడుకులు. సీట్లో కూర్చోగానే భార్య చేయి తన చేతుల్లోకి తీసుకున్నాడు రఘు. "జానీ మంచి సీన్ మిస్ అయ్యావు. వర్షం డాన్సు అయిపోయింది. హీరోయిన్ వంపు సొంపులు తడి చీరలో అబ్బ! ఎంత అందంగా ఉన్నా యనుకున్నావ్" అన్నాడు చిలిపిగా.

భరించలేనంత ఉక్రోషం ముంచుకువచ్చినా బయటపడకుండా మౌనంగా ఉండిపోయింది జానకి. పావుగంట ఆగి—"ఏవండీ హీరో జుట్టు తుమ్మెద రెక్కల్లా ఎంత అందంగా ఉందో కదూ!" అంది బదులు తీర్చుకుంటూ. పగలబడి నవ్వాడు రఘు. "ఎందుకా నవ్వు?" చిరాకుగా అడిగింది జానకి. "అరవై ఏళ్ళ వయసులో కూడా అటువంటి జుట్టు ఉంటుందని భ్రమపడుతున్న నీ అమాయకత్వానికి నవ్వక ఏం చెయ్యమంటావు?" చిలిపిగా అడిగాడు రఘు. మరింత ఉడుక్కుని తల తిప్పుకుంది జానకి.

ఆడబ్రతుకు ఇంతే. అడుగడుగునా అన్యాయమే. చివరికి ఈ విషయంలో కూడా స్త్రీకి అన్యాయమే జరుగుతోంది. తల వంచుకుని కూర్చున్న భార్య బుగ్గ గిల్లాడు రఘు. "చూడు, జానీ, నువ్వు సినిమా చూస్తావని నీ కోసం దాదాపు నాలుగు రూపాయలు వెచ్చించి టికెట్ కొన్నాను. తీరా చూస్తే నువ్వు సినిమా చూడటం లేదు. నా డబ్బు దండుగ అయిపోతోంది" అన్నాడు దిగాలుగా. చిన్నగా నవ్వేసి తెరవైపు దృష్టి మరల్చింది జానకి. ఇద్దరూ సినిమా చూడటంలో మునిగిపోయారు. 'అమ్మా' అంటూ పిలిచింది బేబీ. "ఏమిటమ్మా" అంది జానకి. చిటికిన వేలు చూపించింది బేబీ. 'పద' అంటూ లేవబోయిన భార్యని చెయ్యి పట్టుకుని ఆపేశాడు రఘు. "ఆగాగు. ప్రతిసారీ నువ్వు పారిపోతానంటే నేను ఎలా వూరుకుంటాను? ఈ సారి చాన్సు నాది. కాస్త చల్లగాలి పీల్చుకుని వస్తాను. శిక్ష అనుభవిస్తూ ఉండు" అనేసి బయటికి వెళ్ళిపోయాడు.

తాపీగా పావుగంట తరవాత తిరిగి వచ్చాడు. పది నిముషాలు గడిచేసరికి పిల్లలిద్దరూ కునికిపాట్లు పడడం మొదలుపెట్టారు. "పడుకోకండిరా సినిమా చూడండి" అంటూ క్షణానికో సారి ఇద్దర్నీ లేపుతోంది జానకి. నిద్రపోతే లేపి తీసుకెళ్ళటం కష్టం. జానకి ప్రయత్నం విఫలంచేస్తూ పిల్లలు ఇద్దరూ హాయిగా నిద్రలోకి జారిపోయారు. "వెధవలు—ఈ పడుకునేది ఇంట్లోనే పడుకుంటే మనకు శ్రమ తప్పేది కదూ" అని విసుక్కుంది. మౌనంగా ఉండిపోయాడు రఘు. మరో పది నిముషాలు గడిచేసరికి జానకికి కూడా నిద్రరావటం ప్రారంభించింది.

## అప్పుడే గుర్తు చేసుండే వాణ్ణి!

"ఈ పని చేయమని నీకు రెన్నెళ్ల క్రితం చెప్పాను. మరిచిపోయానని ఇప్పుడు చెబుతున్నావు. నీ కివ్వాల్సిన పైకం ఇవ్వకుండా మరిచిపోయానని అన్నాననుకో. అప్పుడు నువ్వేం చేస్తావ్?"

"నేనైతే వెంటనే గుర్తు చేసుండేవాణ్ణండి. మీలాగ రెన్నెళ్ల పాటు వూరుకుని ఆ తరవాత ఇంత హంగామా చేసే మనిషిని కాదు నేను."

—ప్రసీల్

"అబ్బ ఇంకెంత సేపు వెధవ సినిమా" అంది చిరాకుగా.

"అయిపోయింది. చివరకి వచ్చేసింది. మహా అయితే మరో పావుగంట" అంటూ ధైర్యం చెప్పాడు రఘు.

ఆ పావుగంట కూడా అయిపోయింది. హీరోకి జబ్బు. ఇక బ్రతకడు. అతని హృదయం కాస్త అతని ప్రేయసి విరగ్గొట్టేసింది. అందుకే విరక్తి చెంది, గడ్డం పెంచుకుని కాశ్మీరు శాలువా కప్పుకుని పెద్ద గొంతుతో తలుపులనీ, ద్వారబంధాలనీ, గోడలనీ, కిటికీలనీ, కాలెండర్లనీ, 'నా కెందుకీ నరకం' అంటూ పాట రూపంలో ప్రశ్నిస్తూ హాలంతా తిరుగుతున్నాడు. ఖళ్ళు ఖళ్ళున దగ్గుతూ పడిపోతున్నాడు. లేని శక్తి పుంజుకుని మళ్ళీ లేచి మరింత తారస్థాయిలో పాడుతున్నాడు.

"జానీ, ఇక లే పిల్లల్ని లేపు" అంటూ భార్యని ఆదేశించాడు రఘు. ఇద్దరూ లేచి అతి కష్టం మీద పిల్లల్ని లేపారు. బేబీని రఘు ఎత్తుకున్నాడు. కొడుకుని లేపి చెయ్యి పట్టుకుంది జానకి. ఇద్దరూ బయటికి నడిచారు. కూతుర్ని భార్య చేతికి ఇచ్చి ఆటో వేట మొదలుపెట్టాడు రఘు. సగం మంది రాము అన్నారు. కొంతమంది డబుల్ చార్జి అడిగారు. వెతికి వెతికి మీటర్ మీద నాలుగు రూపాయలు ఎక్కువ ఇచ్చేందుకు అంగీకరించి ఆటోని సాధించగలిగాడు. పిల్లలు మళ్ళీ నిద్రకి పడ్డారు. దీనంగా కూర్చుంది జానకి కళ్ళముందు సినిమాకి బయలుదేరిన దగ్గర నుండీ భర్త పర్సులో నుంచి తీసి ఖర్చు పెట్టిన నోట్లు మెదులుతూ ఉంటే. బరువుగా నిట్టూర్చింది. "మొత్తం నలభై దాకా అయిందేమో కదూ!" అంది మెల్లిగా.

"ఇష్. కాసేపు నోరుమూసుకుంటావా?" అని కసిరాడు రఘు.

జానకికి కోపం రాలేదు. జాలిగా భర్త వంక చూసింది. కష్టార్జితం. పాపం నాకే ఇంత బాధగా ఉంటే ఆయనకి ఎంత కడుపు మండిపోతుందో అనుకుంది బాధగా.

ఇంటి ముందు ఆటో దిగి డబ్బులు ఇచ్చి పిల్లల్నిద్దరినీ ఎత్తుకుని ఇంట్లోకి వచ్చారు. పిల్లల్ని పడుకోబెట్టి వంటింట్లోకి వెళ్ళి మర్నాడు బెడ్‌కాఫీ కోసం ఉంచిన పాలతో కాఫీ కలిపి తెచ్చి రఘుకి అందించింది జానకి. కాఫీ అందుకుంటూ "ఒక ఆస్ప్రో మాత్ర ఇలా ఇవ్వు" అన్నాడు రఘు. టాబ్లెట్, మంచినీళ్ళు అందించి అతని పక్కనే కూర్చుంది. "దిక్కుమాలిన సినిమా వెళ్ళకుండా ఇంట్లో పడుకుంటే హాయిగా ఉండేది. ఇకమించి మంచి సినిమాకి ముందుగా టికెట్లు తీసుకుని వెళదాం. ఇలా అడ్డమైన చెత్త సినిమాలూ చూడద్దు" అంది ఖచ్చితంగా. విరక్తిగా, హేళనంగా నవ్వాడు రఘు.

వారం రోజులు గిర్రున తిరిగొచ్చాయి. శనివారం రాత్రి ఫలహారం ఇడ్లీలు తిని వంటింట్లోంచి బయటికి వచ్చాడు రఘు. తీరికగా కుర్చీలో కూర్చుని కాసేపు రేడియో విన్నాడు. హఠాత్తుగా విసుగు వేసింది. "జానీ, బోర్‌గా ఉంది. సినిమాకి వెళ్దామా?" అని కేక పెట్టాడు. "ఇప్పుడా? ఏ సినిమాకి?" "నువ్వు తయారవ్వు. దేనికోదానికి వెళ్దాంలే." "సరే, ఒక్క పదినిముషాల్లో వస్తున్నా." ✱